క్లుప్తంగా

బీఆర్‌ఎస్‌కు గుడ్‌బై



రాజీనామా పత్రాన్ని చూపిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

ఆసిఫాబాద్: ఆసిఫాబాద్ మాజీ ఏఎంసీ చైర్మన్, గుండి ఎంపీటీసీ గాదెవేణి మల్లేశ్, ఆయన అనుచరులు మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్యామ్ రావు, మాజీ ఆత్మ చైర్మన్ రమేశ్, మాజీ సర్పంచులతో కలిసి బీఆర్‌ఎస్‌కు గుడ్‌బై చెప్పారు. ఆ పార్టీకి ముకుమ్మడి రాజీనామా చేశారు. జిల్లా కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఏఎంసీ చైర్మన్ మాట్లాడారు. రాజీనామా పత్రాన్ని ఎమ్మెల్యే కోవ లక్ష్మికి అందజేస్తామన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో గుండి బ్రిడ్జి నిర్మాణంలో తీవ్ర జాప్యం జరిగిందన్నారు. గుండి బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసేందుకు అధికార కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్ అంతరాయం

కెరమెరి: మండలంలోని గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఎస్‌ఈ వాసుదేవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. తరచూ కరెంట్ ట్రిప్ అవుతుండడం కారణంగా నూతన పీటీఆర్ బిగించనున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించాలని కోరారు.

రేపు వారసంత వేలం

కెరమెరి: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం ఉదయం 11 గంటలకు వారసంత వేలం నిర్వహించనున్నట్లు కార్యదర్శి భీమయ్య ఓ ప్రకటనలో తెలిపారు. ధరావత్తు రూ.10 వేలు డిపాజిట్ చేసిన వారే ఈ వేలంలో పాల్గొనేందుకు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు పాల్గొనాలని కోరారు.

ఆర్టీసీ డీఎంకు సన్మానం



విశ్వనాథ్‌ని సన్మానిస్తున్న విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగులు

ఆసిఫాబాద్: జిల్లాకేంద్రంలోని ఆర్టీసీ డిపో మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన విశ్వనాథ్‌ను గురువారం ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. విశ్రాంత ఉద్యోగులు మోతె రాజన్న, మల్లేశం, దివాకర్, రాంచందర్, కమలాకర్, సుగుణాకర్, భాస్కర్, సయ్యద్ పాల్గొన్నారు.

నిమ్మరసం పంపిణీ



నిమ్మరసం ప్యాకెట్లు అందజేస్తున్న డీఎం విశ్వనాథ్

ఆసిఫాబాద్: జిల్లాకేంద్రంలోని ఆర్టీసీ డిపోలోని ఉద్యోగులకు డీఎం విశ్వనాథ్ గురువారం నిమ్మరసం ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు కార్మికులు ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందడానికి నిమ్మరసం పంపిణీ చేస్తున్నట్లు, వేసవి ముగిసే వరకు ప్రతీరోజు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఎస్టీఐ సరియా, టీఐ3 భారతి, ఉద్యోగులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ‘కంది’



సీఎంతో కంది శ్రీనివాస్‌రెడ్డి

కైలాస్‌నగర్: కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి గురువారం సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో జిల్లా నాయకులతో కలిసి భేటీ అయ్యారు. ఆదిలాబాద్ నియోజకవర్గానికి సంబంధించిన పలు అంశాలు, సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. వాటి పరిష్కారానికి సీఎం సానుకూలంగా స్పందించినట్లుగా కంది శ్రీనివాస్ తెలిపారు. అలాగే రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై సీఎం రేవంత్‌రెడ్డి జిల్లా నాయకులకు దిశా నిర్దేశం చేసినట్లుగా పేర్కొన్నారు. సీఎంను కలిసిన వారిలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, ఆదిలాబాద్ ఎంపీ ఆశావాహ అభ్యర్థి ఆత్రం సుగుణ. తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన యాంత్రీకరణ

- సాగులో వినియోగిస్తున్న యంత్రాలు
- డ్రోన్ ద్వారా ఎరువులు, మందుల పిచికారీ
- ఆదా అవుతున్న సమయం, డబ్బు



నంబాలలో వరిలో పురుగుల మందు పిచికారీ చేస్తున్న డ్రోన్

రెబ్బెన: వ్యవసాయంలో ప్రస్తుతం యాంత్రీకరణ పెరిగిపోతోంది. రోజురోజుకు యంత్రాల వినియోగంపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. అరక దున్నేందుకు ఎద్దులే కనుమరుగు అవుతుండటం, అరక పట్టే కూలీలు దొరకపోవడం, పంటల సాగులో యంత్ర పరికరాల వినియోగం పెరిగింది. పంటలో ఎరువులు చల్లడం, మందులు పిచికారీ తదితర పనులకు యంత్రాలు అందుబాటులోకి వచ్చేశాయి. దాంతో వ్యవసాయ పనులకు తేలిక అవుతున్నాయి.

సమయంతో పాటు డబ్బు ఆదా..

వ్యవసాయ పని చేసేందుకు కూలీల సంఖ్య తగ్గుతోంది. వీరి కొరత అధిగమించేందుకు రైతులు యంత్ర పరికరాలను వినియోగిస్తున్నారు. 10 మంది కూలీలతో చేసే పని యంత్ర పరికరాలతో గంటలో పూర్తి చేసుకుంటున్నారు. దాంతో సమయంతోపాటు డబ్బు ఆదా అవుతోంది. ప్రస్తుతం వర్షాకాలంలో పత్తి సాగు కోసం చేల్లను రైతులు సిద్ధం చేసుకుంటున్నారు. గత సీజన్‌లో సాగు చేసిన పత్తి చెట్లు తొలగించడం, వేసవి దుక్కులు దున్నడం వంటి పనులను ట్రాక్టర్లతో చేపడుతున్నారు.

మందుల పిచికారీకి డ్రోన్

మండలంలోని రైతులు పంటలకు ఎరువులు వేయడం, పురుగల మందుల పిచికారీ పనుల కోసం గతంలో కూలీలనే ఆశ్రయించేవారు.



వ్యవసాయ పనుల కోసం ఉపయోగించే డ్రోన్

తాజాగా నంబాల శివారులో రైతు డ్రోన్ సహాయంతో వరి పంటలకు పిచికారీ చేయించాడు. వరి, పత్తితోపాటు మామిడి తోటలకు ఇలానే పిచికారీ చేసుకోవచ్చు. వరి, పత్తిలో పిచికారీ కోసం కూలీలు రూ.వెయ్యి తీసుకునేవారు. అదే డ్రోన్ సహాయంతో ఎకరాకు రూ.400 నుంచి 450 వరకు తీసుకుంటున్నారు. ఇలా అయితే రోజుకు 30 నుంచి 40 ఎకరాల వరకు పిచికారీ చేసుకోవచ్చు. మందుల పిచికారీతో పాటు ఎరువులు చల్లుకునేందుకు ఇదో మంచి అవకాశమని రైతులు భావిస్తున్నారు.

నిలిచిపోయిన సబ్సిడీ పరికరాలు

వ్యవసాయంలో యంత్రాల వినియోగం పెరుగుతున్నప్పటికి ప్రభుత్వాలు రైతులకు కావల్సిన వీటిని సబ్సిడీపై అందించడంలో నిర్లక్ష్యం వహిస్తోంది. 2018కి ముందు సబ్సిడీపై వీటిని అందించడంతో రైతులు యాంత్రీకరణ వైపు అడుగులు వేశారు. 2018 తర్వాత నుంచి వీటి పంపిణీ నిలిచిపోయాయి. మార్కెట్‌లో వీటిని కొనలేక రైతులు పాత పద్ధతిలో వ్యవసాయం చేస్తున్నారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన అనేక యంత్ర పరికరాలు మార్కెట్‌లో లభ్యమవుతున్నా ప్రభుత్వం సబ్సిడీ అందించకపోవడంతో రైతులు వాటిని వినియోగించుకోవడం లేదు.

సబ్సిడీపై పరికరాలు ఇవ్వాలి



వ్యవసాయానికి కావాల్సిన యంత్ర పరికరాలను ప్రభుత్వం సబ్సిడీపై అందించాలి. ఏళ్ల నుంచి సబ్సిడీ పరికరాలు రావడం లేదు. బయట మార్కెట్‌లో వేల రూపాయలు ఖర్చు చేసి కొనుగోలు చేసే ఆర్థిక స్థోమత లేక పాత కాలం పద్ధతుల్లో వ్యవసాయం చేయాల్సి వస్తోంది. వ్యవసాయం లాభసాటిగా ఉండాలంటే సబ్సిడీపై పరికరాలు అందించాలి.

– కుందారపు బాలక్రిష్ణ, రెబ్బెన

డ్రోన్ కొనుగోలు చేశాను



మాది మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట. వ్యవసాయంలో డ్రోన్ వినియోగించేందుకు రూ.6 లక్షలు వెచ్చించి కొనుగోలు చేశా. రాష్ట్రంలో డ్రోన్ కొనుగోలుపై సబ్సిడీ లేదు. పక్క రాష్ట్రాల్లో 50 శాతం సబ్సిడీ ఉంది. డ్రోన్ ఆపరేట్ చేసేందుకు హైదరాబాద్‌లో ప్రత్యేకంగా పైలెట్ ట్రెనింగ్ కోర్సు పూర్తి చేశాను. డ్రోన్‌తో మందుల పిచికారీతో ఉపాధి దొరకటంతో పాటు రైతులకు సమయం డబ్బు ఆదా అవుతోంది.

– కామెర ఆదిత్య, డ్రోన్ యజమాని

కొనసాగుతున్న ‘పది’ పరీక్షలు



కెరమెరి పరీక్ష కేంద్రం ఎదుట గుమికూడిన విద్యార్థులు

దహెగాం: ఈనెల 18 నుంచి ప్రారంభమైన పదోతరగతి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. గురువారం విద్యార్థులు ఆంగ్లం పరీక్ష రాశారు. మొత్తం 269 మంది విద్యార్థులు ఉండగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కేజీబీవీ పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 149 మందికి గాను 149 మంది పరీక్ష రాయగా, కేజీబీవీలో 120 మందిలో 119 మంది పరీక్షకు హాజరయ్యారు. అందులో ఒక్కరు గైర్హాజరైనట్లు సీఎస్‌లు కిషన్‌రావు, అమరేందర్‌రెడ్డి తెలిపారు. పరీక్ష కేంద్రం వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు.

కెరమెరి: కెరమెరి, మోడి పరీక్ష కేంద్రాల్లో పదో తరగతి ఆంగ్ల పరీక్ష ప్రశాంతంగా జరిగింది. కెరమెరి, గోయగాం, అనార్‌పల్లి, మోడి, కేజీబీవీ, హట్టి, రాంజీగూడ, ఝరి పాఠశాలలకు చెందిన మొత్తం 296



కెరమెరి: విద్యార్థినులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

విద్యార్థులకుగాను 293 మంది పరీక్ష రాసినట్లు సీఎస్‌లు చంద్రశేఖర్, స్వర్ణలత, డీవోలు ప్రేంసింగ్, అచ్యుతానంద్ తెలిపారు. కెరమెరిలో 141, మోడిలో 155కు 152 మంది. విద్యార్థులు పరీక్షలు రాశారు. 17 మంది ఇన్విజిలేటర్లుగా వ్యవహరించారు.

ముగిసిన సిరిచెల్మ మల్లన్న జాతర

ఇచ్చోడ: మండలంలోని అతిపురాతన సిరిచెల్మ మల్లికార్జున ఆలయ జాతర గురువారం ముగిసింది. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన అగ్ని గుండంలో నుంచి భక్తులు నడుస్తూ.. మొక్కులు తీర్చుకున్నారు. అలాగే ఘనంగా రథోత్సవం నిర్వహించారు. ఈ రెండు ఘట్టల నిర్వహణతో జాతర ముగిసింది. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో సందడి నెలకొంది. తెల్లవారు జామున 4 గంటల ప్రాంతంలో చెరువులో స్నానాలు ఆచరించి మల్లికార్జున్ని దర్శించుకునేందుకు బారులు తీరారు. పంచాయతీ ప్రత్యేకాధికారి జాదవ్ రామారావు ఏర్పాట్లను పర్యవేక్షించగా.. ఎస్సై నరేశ్ అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు



అగ్ని గుండం నుంచి వెళ్తున్న భక్తులు

పోషకాహారంతోనే ఆరోగ్యం



లింగాపూర్: అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ లైలా



చింతలమానెపల్లి: రణవెల్లి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అక్షరాభ్యాసం

చింతలమానెపల్లి: ప్రతిఒక్కరూ పోషకాహారం తీసుకోవడంతోనే ఆరోగ్యంగా ఉంటారని మండల ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శంకరమ్మ తెలిపారు. మండలంలోని రణవెల్లి అంగన్‌వాడీ కేంద్రంలో టేకంగూడ, రణవెల్లి-1, రణవెల్లి-2 కేంద్రాల పరిధిలో గురువారం చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం, గర్భిణులకు సీమంతం నిర్వహించారు. పౌష్టికాహారంపై అవగాహన కల్పించి పోషకాలు అందించే ఆహార పదార్థాల ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా మహిళలు, చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తున్నామని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి ప్రదీప్, ఏఎన్‌ఎం మీనా, అంగన్‌వాడీలు టి.విజయలక్ష్మి, టి.మాధవి, డి.అనిత తదితరులు పాల్గొన్నారు.

బెజ్జూర్: పోషకాహారంతోనే ఆరోగ్యంగా ఉంటారని సూపర్‌వైజర్ కరుణ అన్నారు. పోషణ పక్షోత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని కుంటాలమనేపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో సీమంతం, అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా 3 నుంచి ఆరేళ్ల పిల్లలకు ప్రీస్కూల్ ప్రాముఖ్యత, పోషకాహారం, చిరుధాన్యాల గురించి వివరించారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, తల్లులు, పిల్లలు కిశోర బాలికలు ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్: చిరుధాన్యాలతో ఆరోగ్యానికి మేలు జరుగుతుందని ఐసీడీఎస్ పెంచికల్‌పేట్ సూపర్‌వైజర్ హసీనా అన్నారు. మండలంలోని మురళీగూడ అంగన్‌వాడీ కేంద్రంలో పోషన్ పక్వాడలో భాగంగా మహిళలు గర్భిణులు, బాలింతలు, కిశోరబాలికలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. ప్రతీరోజు తీసుకునే ఆహారంలో జొన్నలు, సజ్జలు, రాగులు, పెసర్లు, మినుములు, పల్లీలు ఇతర పోషకాహారం ఉండేలా చూసుకోవాలన్నారు. మాజీ సర్పంచ్ ఈశ్వరిబాయి, పంచాయతీ కార్యదర్శి శాంతయ్య, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

దహెగాం: మండలంలోని పీపీరావు కాలనీలో అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషణ పక్షోత్సవాలు నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్త జయప్రద, ఏఎన్‌ఎం హేమలత, పంచాయతీ కార్యదర్శి రోహిదాస్ చిన్నారులు, తల్లులు పాల్గొన్నారు.

లింగాపూర్: గూంనూర్ (బి) పంచాయతీ సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం అన్నప్రాసన, అక్షరభ్యాసం నిర్వహించారు. సూపర్‌వైజర్ లైలా మాట్లాడుతూ చిన్నారులు పోషకాహారం తీసుకోవాలన్నారు. అనంతరం గర్భిణులకు సీమాంతం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశవర్కర్లు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

పన్ను వసూళ్లలో పల్లెలు

- పల్లె ప్రగతితో ఆదివాసీల్లో చైతన్యం
- ఇంటిపన్నులు చెల్లింపుల్లో వేగం



వందశాతం పన్నులు వసూళ్లు అయిన ముకదంగూడ పంచాయతీ

కెరమెరి: పల్లెల్లో అనేక మంది నిరక్షరాస్యులు ఉన్నారు. అందులో ఇంటి పన్నుల గురించి అసలే తెలియదు. అయితేనేం గ్రామాల్లో ఇంటి పన్నులు చెల్లించి గ్రామాభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నారు. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలపై అవగాహన చేసుకుంటున్నారు.

మండలంలో మొత్తం 31 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అందులో ముకదంగూడ, నిసాని, ఆగర్‌వాడ, దేవాపూర్, గోండ్‌గూడ, కరంజివాడ, కెలిబి, కెస్లాగూడ, మెట్టపిప్రి, రింగన్‌ఘాట్ పంచాయతీల్లో వందశాతం ఇంటి పన్నులు వసూళ్లు అయ్యాయి. గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్నులు వేగంగా చెల్లించడంతో ఆ ×గిరిశెపల్లెలు తన ప్రత్యేకతను చాటుకున్నాయి. పంచాయతీల కార్యదర్శుల ప్రత్యేక శ్రద్ధతో పన్నులు వసూళ్లు చేశారు. ప్రతీరోజు గ్రామసభలు నిర్వహించి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు వివరించడంలో సఫలీకృతమయ్యారు. పల్లె ప్రగతి కార్యక్రమంతో ఆదివాసీల్లో చైతన్యం కలిగింది. ఇందులో భాగంగా పారిశుధ్యం, చెత్త తొలగించడం, వీధి దీపాలకు లైట్లు అమర్చడం, విద్యుత్ స్తంభాలు సరిచేయడం, హరితహారంలో మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడం, పరిసరాలు శుభ్రం చేయడం వంటి పనులు చేపడుతున్నారు. కాగా, ఝరి, పరంధోళి, ఇందాపూర్, తుమ్మగూడ, భోలాపటార్, బోరిలాల్గూడ, ధనోరా, అంతాపూర్, జోడేఘాట్, పార్డ, మోడి, సాకడ, ఖైరీ, కొఠారి, సుర్దాపూర్, బాబేఝరి, సాంగ్వి గ్రామ పంచాయతీల పన్నులు 90–98 శాతానికి చేరుకున్నాయి.



కెరమెరిలో ఇంటిపన్నులు వసూలు చేస్తున్న సిబ్బంది

గ్రామాభివృద్ధి కోసమే..

గ్రామాల్లో ఇంటి పన్నులు, ఇతరత్రా పన్నుల నుంచి వచ్చే నిధులను గ్రామాభివృద్ధికి ఖర్చు చేయనున్నారు. వీధి దీపాలు అమర్చడం, పారిశుధ్య పనులు చేపట్టడం, సీసీ చార్జీలు చెల్లించడం, కార్యాలయాల పనులకు వాడుకోవడం, స్టేషనరీ ఖర్చుల కోసం, కూలీలు, కామాటీల వేతనాలు ఇతర అవసరాలకు వసూళ్లు చేసిన పన్నులు ఉపయోగిస్తారు. మండలం మొత్తంలో రూ.37,38,104 డిమాండ్ ఉండగా, ఇప్పటివరకు రూ.31,41,310 వసూళ్లు చేసి 84 శాతానికి చేరింది. ఈనెలాఖరు వరకు వందశాతం పన్నుల వసూళ్లు పూర్తి చేయనున్నారు.

ఈనెలాఖరు వరకు వందశాతం



మండలంలోని ఇప్పటి వరకు 84 శాతం ఇంటి పన్నులు వసూళ్లు చేశాం. ఈనెలాఖరు వరకు మిగిలిన మొత్తాన్ని వసూళ్లు చేస్తాం. గతానికి ఇప్పటికి ప్రజల్లో చాలా మార్పు వచ్చింది. ఇంటి పన్నులు చెల్లించేలా వారికి అవగాహన కల్పిస్తున్నాం. – మహమ్మద్ అంజద్‌పాషా, ఎంపీవో

నిబంధనలు ప్రతిఒక్కరూ పాటించాలి

బోథ్: ఎన్నికల నిబంధనలను ప్రతిఒక్కరూ పాటించాలని ఐటీడీఏ పీవో, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ఖుష్బూ గుప్తా అన్నారు. గురువారం బోథ్ నియోజకవర్గ కేంద్రంలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నియోజకవర్గంలోని మండలాల తహసీల్దార్లు, నాయిబ్ తహసీల్దార్లు, ఎస్సైలు, సెక్టార్ అధికారులు, రాజకీయ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు వారి విధుల్లో నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించాలని అధికారులకు సూచించారు. అనంతరం రాజకీయ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయా పార్టీల నాయకులు ఎన్నికల నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో అధికారులు, ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ఖుష్బూ గుప్తా

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన

బోథ్: మండలంలోని కనుగుట్ట గ్రామంలో శబరిమాత విగ్రహ ప్రతిష్ఠాపనను గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రతిష్ఠాపన వేడుకలు మూడు రోజుల పాటు జరగనున్నాయి. మొదటి రోజు గ్రామంలోని పలు వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఆశ్రమంలో వేద పండితుల మధ్య హోమం చేపట్టారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

ఓటరుగా నమోదు చేసుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు కోరారు. గురువారం జిల్లా కేంద్రంలోని దస్నాపూర్ ప్రభుత్వ బాలికల పాఠశాల, సెంట్రల్ లైబ్రెరీలో ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటుహక్కు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నమోదు కోసం ఫారం 6 నింపి బూత్ లెవల్ అధికారులకు సమర్పించాలని కోరారు. పోటీ పరీక్షలకు హాజరవుతున్న అభ్యర్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాలను సందర్శించిన డీఈవో

ఉట్నూర్‌రూరల్: పది పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డీఈవో ప్రణిత అన్నారు. గురువారం పట్టణ కేంద్రంలో కొనసాగుతున్న పులాజీ బాబా, జెడ్పీ పాఠశాల పరీక్ష కేంద్రాలను ఆమె సందర్శించారు. పరీక్షలు నిర్వహిస్తున్న తీరు, ఏర్పాట్లు, బందోబస్తు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంఈవో కార్యాలయంలో ఎంఈవో శ్రీనివాస్‌తో మాట్లాడారు. పరీక్ష కేంద్రాల్లో పిల్లలు ఇబ్బందులు పడకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎలాంటి ఘటనలకు తావివ్వకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదే విధంగా ఆర్‌జేడీ సత్యనారాయణ్ రెడ్డి పరీక్ష కేంద్రాలను సందర్శించారు.



వివరాలు అడిగి తెలుసుకుంటున్న డీఈవో ప్రణిత

అడవుల సంరక్షణ అందరి బాధ్యత

ఇంద్రవెల్లి: అడవుల రక్షణతో పాటు జంతువుల సంరక్షణ బాధ్యత అందరిపై ఉందని జిల్లా బయోడైవార్సిటీ కోఆర్డినేటర్ సోన్‌కాంబ్లే గోపినాథ్, ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుడు శ్రీకాంత్‌లు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సన్‌షైన్ పాఠశాలలో జీవవైవిధ్యంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అన్నిరకాల మొక్కలతో పాటు చెట్లను పెంచాలన్నారు. జంతువుల సంరక్షణకు కృషి చేయాలని కోరారు. అడవులతోనే మానవ మనుగడ సాధ్యమన్నారు. కార్యక్రమంలో సన్‌షైన్ పాఠశాల నిర్వాహకులు నర్సయ్య, గణేష్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న వైద్యుడు శ్రీకాంత్